# ఎరక్కపోయి ఇరుక్కున్నవాడు



అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి.

ప్రధానమైన రెండు పార్టీలు అన్ని స్థానాలకీ తమ తమ అభ్యర్థులను నిలబెట్టాయి, ఎన్నికల తేదీ దగ్గర పడుతున్నకొద్దీ ప్రచారం ఇరువైపులనుంచీ ముమ్మరంగా కొనసాగింది.

ఆ నియోజకవర్గంలో వెంకట్రావు, పుల్లారావు తమ తమ పార్టీల తరపున నిలబడ్డారు. వారిద్దరిమధ్య పోటీ ‘నువ్వా- నేనా? అన్నంతగా సాగింది. ఎవరు నెగ్గుతారని ఏ రాజకీయ జ్యోతిషుడు చెప్పలేని పరిస్థితి యేర్పడింది. ఎవరు గెల్చినా బహు కొద్దిపాటి మెజారిటీతోనే అనేది మాత్రం స్పష్టమయింది. అక్కడక్కడ జరిగిన కొన్ని సంఘర్షణలను మినహాయిస్తే అంతా ప్రశాంతంగానే జరిగిందని చెప్పవచ్చు.

ఎన్నికల రోజు రానే వచ్చింది.

పోలింగ్ ముమ్మరంగా సాగింది. ఎవరిమటుకు వారు తామే గెలుస్తామని ఢంకా భజాయించి చెప్తున్నారు. పైకి ఎంత గాంభీర్యాన్ని ప్రదర్శించినా- లోపల మాత్రం ఇద్దరికీ బెరుగ్గానే ఉంది. తినాలి కనుక ఏదో ఇంత తింటున్నారు కాని, తిన్నదేమీ వంటికి పట్టడంలేదు. కంటికి కునుకైతే రావడమే లేదు.

ఓట్ల లెక్కింపు రోజు వచ్చింది. చూస్తుండగానే వెంకట్రావు ఓట్లు వేలలోకి వెళ్లిపోసాగాయి. పుల్లారావు ఓట్లు నత్తనడకన సాగుతున్నాయి.

మధ్యాహ్నానికి వెంకట్రావు పదివేల మెజారిటీతో ఉన్నాడు. అతని తరఫు మనుషులకు, అతని పార్టీవారికీ ఆనందంతో పట్టపగ్గాలు లేకుండా ఉన్నాయి. కొందరు ఉత్సాహవంతులు దండల కోసం పరుగెత్తారు. మరికొందరు అత్యుత్సాహవంతులు మేళతాళాలతో ఊరేగింపు కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

పుల్లారావుకి ముచ్చెమటలు పోయసాగాయి. ఇంకా లెక్కంచవలసిన నియోజక వర్గాలలో తనకి ప్రాబల్యం అంతగా లేదు. తన ఓటమి ఖాయం అనుకున్నాడు. ఆ అవమానాన్ని ఊహించుకోలేకపోయాడు.

వెంటనే ఆదరాబాదరాగా ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశాడు. ఎన్నికలలో ఘోరమైన అక్రమాలు జరిగాయని, అందువల్ల ఆ విషయమై విచారించి అవసరమైతే తిరిగి ఓట్లు లెక్కించాలనీ పెద్ద స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

సాయంత్రానికి వెంకట్రావ్ వెనకబడి పుల్లారావు పరుగు అందుకున్నాడు, రాత్రి ఏడు గంటలకు లెక్కింపు పూర్తి అయింది. 26 ఓట్ల ఆధిక్యతతో పుల్లారావు గెలిచాడు. తన గెలుపును తానే నమ్మలేకపోయాడు. తొందర పడ్డందుకు మనసులోనే కుళ్ళికుళ్ళి ఏడ్చాడు. ఈ సారి ఓట్లు లెక్కించాలని పట్టుబట్టడం వెంకట్రావు వంతయింది.

అభ్యర్థులిద్దరూ ఓట్లు తిరిగి లెక్కబెట్టాలని కోరారు కనుక మళ్లీ లెక్కించడం జరిగింది. ఈసారి 11 ఓట్ల తేడాతో వెంకట్రావు గెలిచాడు.

ఎరక్కపోయి నోరు తెరిచి ఇరుక్కున్నానని లబలబలాడాడు పుల్లారావు.

– తెలుగు వార పత్రిక... *14 జనవరి ' 83*